# చంద్రబాబును అరెస్ట్ చేసినందుకు వైసీపీ మూల్యం చెల్లించుకోక తప్పదు

## జనసేన నేత గురాన అయ్యలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును వైసీపీ ప్రభుత్వం పైశాచిక ఆనందం కోసమే అరెస్ట్ చేసిందని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు.తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు జగనాసుర దహనం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో సైకో పాలన పోవాలంటూ రాసిన పత్రాలను జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 7 నుంచి 7.05 గంటల మధ్య దహనం చేశారు. ఈ సందర్భంగా జనసేన నేత గురాన అయ్యలు మాట్లాడుతూ వైసీపీని ఓడించడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. జగన్ లాంటి నియంతకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.చంద్రబాబు వల్ల వైసీపీ ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను మేనేజ్ చేస్తోందంటూ మండిపడ్డారు. చంద్రబాబు బరువుపై జైలు అధికారులు, వైద్యులు విభిన్న ప్రకటనలు చేస్తున్నారన్నారు.చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చంద్రబాబుకు చికిత్స అందించకుండా హేళన చేసేలా వైసీపీ నాయకులు మాట్లాడటం దారుణంగా ఉందన్నారు. భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మరోవైపు జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితంపై వైసీపీ చేస్తున్న విమర్శలు సిగ్గుచేటన్నారు. రాజకీయ విమర్శలకు సమాధానం చెప్పే సత్తా లేకనే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కాటం అశ్విని,అడబాల వేంకటేష్ , ఎమ్ .పవన్ కుమార్ , వజ్రపు నవీన్ కుమార్, పృథ్వీ భార్గవ్, కంది సురేష్ కుమార్, వి.వెంకట రమణ,కె.సాయి, కంకిపాటి రాజు, సుర్యచంద్రులు, శివ కుమార్ పాల్గొన్నారు.

## ఆర్టిసి బస్సు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - రామభద్రపురం : ఆర్టిసి బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడని స్థానిక సురేంద్ర నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తారాపురం గ్రామానికి చెందిన బెవరపోలినాయుడు 49సం, సోమవారం మధ్యాహ్నం పొలం నిమిత్తం ఊరిక సమీపంలో ఉన్న మంచినీరు కోనేరు ప్రక్కన ఉన్న పొలం పనులకు వెళ్ళినాడు. పొలం పనులు ముగించుకొని సాయంకాలం 7గం ప్రాంతంలో ఇంటికి తిరిగి వస్తుండగా టీ లీఫ్ దాటిన తరువాత సాలూరు నుంచి రామభద్రపురం వైపు వస్తున్న ఏపీ 35 జడ్ 0151 నెంబర్ గల ఆర్టీసీ బస్సు 26వ నెంబరు జాతీయ రహదారిపై నడుచుకుని వస్తున్న పోలినాయుడిని వెనక నుండి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పోలినాయుడు అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఇదిలా ఉండగా ఈ విషయాన్ని అక్కడే ఉన్న తారాపురం గ్రామానికి చెందిన కొంతమంది యువకులు గమనించి ఆపకుండా వెళ్ళిపోతున్న ఆర్టీసీ బస్సును వెంబడించి కిలోమీటర్ వెళ్లిన తర్వాత టీ కాల లక్ష్మణ స్వామి గుడి వద్ద రోడ్డుకి అడ్డంగా బైకులు నిలుపుదల చేసి ఆర్టీసీ బస్సును ఆపారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్కు ప్రమాద ఘటనపై ఫిర్యాదు చేశారు. ఎస్ ఐ సురేంద్ర నాయుడు మరియుసిబ్బంది చాకచక్యంగా స్పందించి బస్సు వద్దకు చేరుకున్నారు.కండక్టర్ డ్రైవర్ని విచారణ చేపట్టగా ఢీకొట్టడం నిజమె ననీ ఒప్పుకున్నాడని ఎస్ఐ తెలిపారు. మృతుని కుమారుడు జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై కేసు నమోదు చేసి బస్సును అదుపులోకి తీసుకున్నారు. శవపంచినామా జరిపి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా బస్సు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్షంగ చూసిన మంది యువకులు విలేకరులకు తెలిపారు. అలాగే తారాపురం గ్రామ మధ్యలో జాతీయ రహదారి ఉండడంతో వాహనాలు చాలా స్పీడ్ గా అజాగ్రత్తగా నడపడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు, అన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు స్పందించి ఊరికి దగ్గరలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని గ్రామస్తులు కోరుచున్నారు.

## శ్రీదుర్గాదేవి, శ్రీదారగంగమ్మ తల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దసరా పండుగ సందర్భంగా ఎస్.కోట పట్టణంలోని శ్రీదుర్గాదేవి, శ్రీదారగంగమ్మ అమ్మవారి ఆలయాలను మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దారగంగమ్మ ఆలయం ఆవరణలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామిని కూడా ఎమ్మెల్యే సందర్శించి పాలాభిషేకం పూజలు నిర్వహించారు. ఎస్.కోట నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవార్లను పూజించినట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు వెల్లడించారు. ఎమ్మెల్యే కడుబండికి అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఎమ్మెల్యే కడుబండి వెంట రాష్ట్ర ఫోక్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పట్టణ అధ్యక్షుడు షేక్ రెహ్మాన్, సీనియర్ నాయకులు కూనిరెడ్డి వెంకటరావు, పెనగంటి జగదీష్, కదారి అప్పయ్య, కదారి జయశంకర్, మజ్జి శేఖర్, శ్రీదుర్గాదేవి ఆలయ అధ్యక్షుడు కేవీఎస్ రామరాజు, సభ్యులు జెర్రిపోతుల ఉమ, జెర్రిపోతుల మురళి, పెనగంటి గంగరాజు, అర్చకులు అగ్నిహోత్రం రాజగోపాలాచార్యులు, రవి తదితరులు ఉన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి మృతి



విశాలాంధ్ర -తెర్లాం : బాడంగి: డొంకినవలస గ్రామం, బాడంగి మండలానికి చెందిన అంబటి శ్రీనివాసరావు, వయస్సు 44 సంవత్సరాలు అనే వ్యక్తి మద్యం త్రాగుటకు అలవాటు పడి త్రాగిన తరువాత రోజు ఇంట్లో వాళ్లతో గొడవలు పడుతుండటంతో భార్య మరియు అతని తండ్రి మందలించగా తేది 21.10.2023 రాత్రి 09.00 గంటలకు చనిపోదామనే ఉద్దేశ్యంతో పురుగు మందు తాగగా, ఆ విషయం గమనించిన అతని భార్య మరియు బంధువులు బాడంగి సిహెచ్ సీ కి చికిత్స నిమిత్తం వెంటనే తరలించారు, తరువాత మెరుగైన వైద్యం కొరకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విజయనగరం తరలించగా తేది 22.10.2023 రాత్రి 06.24 గంటలకు చికిత్స పొందుతూ అక్కడ మరణించగా, మృతుని భార్య అయిన అంబటి పార్వతి పిర్యాదు మేరకు డి. సన్యాసిరావు, హెడ్ కానిస్టేబుల్, బాడంగి పోలీస్ స్టేషన్ వారు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## ఆలుగుబిల్లి గ్రామంలో జగనాసుర దహనం

### - చంద్రబాబు నాయుడు అరెస్టు ముమ్మాటికీ కక్ష సాధింపే : గొంప క్రిష్ణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట : పోలీసుల నిర్బంధాలను దాటుకుని శృంగవరపుకోట మండలం, ఆలుగుబిల్లి గ్రామంలో జగనాసుర ఫోటోలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం రాత్రి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపేనని వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సైకోలా వ్యవహరిస్తున్నారని, చంద్రబాబు నాయుడుపై లేనిపోని అక్రమ కేసులు బనాయించి జైలు పాలు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. చంద్రబాబు నాయుడుపై ఇప్పటికైనా ప్రభుత్వం అక్రమ కేసులు ఎత్తివేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యమని స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి ఫోటోలను మంటల్లో వేసి టీడీపీ శ్రేణులు సైకో పోవాలి.. సైకిల్ రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాగా టీడీపీ శ్రేణులు సీఎం జగన్మోహన్ రెడ్డి ఫోటోలు మంటల్లో వేసి దహనం చేస్తున్న సందర్భంగా ఎస్.ఐ తారకేశ్వరరావు, పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎస్.ఐ తారకేశ్వరరావు గొంప క్రిష్ణ, నాయకులను జీపులో పోలీసు స్టేషనుకి తరలించే ప్రయత్నాన్ని ఆలుగుబిల్లి టీడీపీ నేతలు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అడ్డుకున్నారు. పోలీసులు, స్థానికుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ, నాయకులను ఎస్.కోటలోని పోలీసు స్టేషన్ కి తరలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జుత్తాడ రామసత్యం, లగుడు రవికుమార్, ఎం.మంగరాజు, ఆలుగుబిల్లి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. లేకుంటే ఆందోళన మరింత ఉధృతమయ్యేదని స్థానికులు వెల్లడించారు.

## ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణంలో ప్రభాస్ యువసేన అధ్యక్షుడు శివ అద్వర్యం లో స్థానిక టీబీర్ థియేటర్ వద్ద టీబీర్ సమస్థల అధినేత తూముల కార్తీక్ చేతుల మీదగా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.అనంతరం బర్తే కేక్ కటింగ్ చేశారు .ఈ సందర్భంగా తూముల కార్తీక్ మాట్లాడుతూ ప్రభాస్ యువసేన బొబ్బిలి లో చేసిన సేవా కార్యక్రమాలను అభినందించారు... అనంతరం నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం లో దిలీప్, హరి, శ్రీకర్ మరియు మిగతా ప్రభాస్ యువసేన సభ్యులు పాల్గొన్నారు

## జానపద కళలు,తెలుగు భాషను కాపాడుకోవాలి

### జానపద కళా పీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు

విశాలాంధ్ర - వేపాడ : జానపద కళలను ,తెలుగు భాషను కాపాడుకోవాలని గిడుగు రామమూర్తి తెలుగు భాష, జాన పద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు కోరారు.మండలంలోని కొండ గంగు పూడి పంచాయితీ శివారు ఎస్.కోట సీతారాంపురం గ్రామంలో కళాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం విజయ దశమిని పురస్కరించుకొని జానపద కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన సంస్కృతికి మూలాలలైన తోలు బొమ్మలాట, జముకులు పాట, తప్పెట గుళ్ళు, గంగిరెద్దులు , దాసర్లు, బుడబుక్కలు ,జంగాలు డప్పులు, థింసా,స్త్రీలపాటలు , బొబ్బిలి యుద్ధం, కాటమ రాజు కథ, గైరమ్మ పాటలుఅంతరించి పోతున్నాయని వాటినికాపాడు కోవాలని కోరారు. అలాగే ఆంగ్లభాష మాధ్యమ మోజులో మరచి పోతున్న తెలుగు భాషను కాపాడుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సేవ గరిడి, తప్పెట గుళ్ళు, డప్పులు , ఎరుకు ల పాటలు,స్త్రీల పాటలు కళాకారులు తమ పాటలను వినిపించారు .పిల్లలు అమ్మనాన్నముద్దు, మమ్మీ డాడీ వద్దు, అత్తా, మామముద్దు, ఆంటి, అంకుల్ వద్దు, తెలుగు భాష ముద్దు వంటిప్లేకార్డులను ప్రదర్శించారు. కళాపీఠం సభ్యుడు పొట్నూరు సురేష్ మాట్లాడతూ బద్రి కూర్మారావు ఇరవై ఏళ్లుగా కళలు, సాహిత్యం పరిరక్షణకు పాటుపడుతు పుస్తకాలు రాసారని, నేటి తరంలోనూ దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల్లో కళా కారులు సమావేశం ఏర్పాటు చేసి సభలు, సత్కారాలు జరపడం ఆనందం కలిగిస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా సేవ గరిడి కళాకారుడు చిన గుడిపాల గ్రామానికి చెందిన కోట అప్పలనాయుడు, డప్పు కళాకారులు పొట్నూరు శ్రీరాములు, ములపర్తి రాముడు మొదలగు కళాకారులను దుస్సాలువలతో ఘన సన్మానం చేశారు.ఈ కార్య క్రమంలో గ్రామ పెద్దలు, కళాకారులు, మహిళలు పాల్గొన్నారు.

## దేవీ నవరాత్రి మండపాలను దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ చోట్ల ఏర్పాటు చేసిన దేవీ నవరాత్రి మండపాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి దర్శించి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి ఉత్సవ మండపానికి చేరుకున్నారు. ఆ తర్వాత బాబా మెట్టలో దేవి పార్కులో వేంచేసియున్న దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు. అలాగే అశోక్ నగర్,బింగివీధి తదితర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన దసరా ఉత్సవాలలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఐదో డివిజన్ కార్పొరేటర్ గాదం మురళి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా బాబా మెట్ట దేవి పార్కులో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న మన్నారు. 2 ఏళ్ల క్రితం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సహకారంతో శాశ్వత మండల నిర్మాణాన్ని ఏర్పాటు చేసామన్నారు. దీనివల్ల ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మికతతో, భక్తి భావంతో నిండిందని అన్నారు. ఈ సంవత్సరం తొమ్మిది రోజులు పాటు దుర్గాదేవిని ఘనంగా కొలువు తీర్చి ప్రతిరోజు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు కేవీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 29న విజయవాడలో జరగబోవు ధర్నాకు తరలిరండి

విశాలాంధ్ర - సీతానగరం : ఈనెల 29న విజయవాడలో ధర్నా చౌక్ వద్ద జరగనున్న ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనంజయరావు తెలిపారు.సీతానగరం మండలంలోని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ మండలశాఖ మంగళ వారం నాడు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.పాత పెన్షన్ పునరుద్ధరణ, వేలకోట్ల రూపాయల బకాయిల చెల్లింపు కోరుతూ రాష్ట్ర స్థాయి ధర్నాను చేపట్టనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులందరూ పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2004 ముందు నోటిఫికేషన్ - అనంతరం నియామకమైన టీచర్లకు, ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, సిపిఎస్ ఉద్యోగుల ప్రాన్‌కు జమ కావాల్సిన 1750కోట్ల రూపాయలు, రావాల్సిన 90 శాతం డిఏ బకాయిలను ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీతానగరం మండలశాఖ అధ్యక్షులు టి.గౌరు నాయుడు మాట్లాడుతూ టీచర్లు, ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన డిఎ, డిఆర్, పిఆర్సీబకాయిలు మరియు కొత్త డిఏ బకాయలను తక్షణమే చెల్లించాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి వి.సత్యనారాయణ మాట్లాడుతూ సరెండర్ లీవ్ ఎన్కాష్మెంట్, మెడికల్ బిల్స్ కలిపి 2,500 కోట్లరూపాయల బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. జిల్లా కార్యదర్శి పిఎస్ మోహన్ రావు మాట్లాడుతూ పిఎఫ్, ఏపీ జిఎల్ఐ లోన్స్, క్లైమ్స్ తదితర బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించడం లేదని, తనవంథాని మార్చుకోవాలని పిలుపునిచ్చారు. లేనియెడల ప్రభుత్వం తగినమూల్యం చెల్లించుకోవడం తప్పదని హెచ్చరించారు. ఈసమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు ఎస్.సత్యం నాయుడు, ఎం గౌరీశ్వరరావు, సి హెచ్ శ్రీనివాసరావు, ఆర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు

## ఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా ఆయుధ పూజ

### జిల్లా ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

విశాలాంధ్ర - పార్వతీపురం : దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో ఆయుధ పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.విజయాలకు చిహ్నామైన విజయదశమి అందరికీ అన్ని రంగాల్లో విజయం చేకూర్చాలని, జిల్లా ప్రజలకు, జిల్లాలోని అధికారులకు, జిల్లా పోలీస్ సిబ్బందికి విజయదశమి పండుగ శుభాకాంక్షలను తెలిపారు. పోలీసులు అన్ని అంశాల్లో విజయవంతంగా ముందుకు సాగుతూ జిల్లా పోలీస్ శాఖ పేరు ప్రతిష్టలు పెంచాలని కోరారు. విజయదశమి పండుగ సందర్భంగా మంగళవారం పోలీస్ కార్యాలయంలో దుర్గామాత ఆశీస్సులకై పోలీసు ఆయుధాలు, వాహనాలకు ఆయుధపూజను నిర్వహించినట్లు తెలిపారు.దుష్టశిక్షణ, శిష్టరక్షణగా చెడుపై విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా ఆయుధపూజను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో, నిష్టతో చేశారు.ఈపూజలో పోలీస్ సిబ్బంది రోజువారీ చర్యల్లో ఉపయోగించే పలు రకాల ఆయుధాలతోపాటు మోటారు ట్రాన్సుపోర్ట్ విభాగంలోని వివిధరకాల పోలీసు వాహనాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకూడదంటూ పూజలు నిర్వహించామని చెప్పారు.ఆయుధపూజ అనేది పోలీసులకు, భద్రతాదళాలకు అత్యంత ముఖ్యమైన పండగని, పోలీసులు దుష్ట శిక్షణ, శిష్టరక్షణకు కట్టుబడి ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా వ్యవహరించాలని, అన్ని విషయాలలో విజయవంతంగా ముందుకు సాగుతూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు ప్రతిష్టలు రావాలని కోరుతూ పూజలు నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలోఆర్ఐలు శ్రీరాములు, కుమార్,శ్రీనివాసరావు ,ఆర్ ఎస్ఐ రమేష్, ఏఆర్ సిబ్బంది,డి.సి.ఆర్.బి సిబ్బంది,ఎస్బిసిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంఈఓల సమస్యలపై విద్యామంత్రి బొత్సకు వినతి పత్రం అందజేత

విశాలాంధ్ర - పార్వతీపురం : ఎంఈఓల వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రంను అందజేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా మండల విద్యాశాఖ అధికారుల సంఘం అధ్యక్షుడు సామల సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం పర్యటనకు విచ్చేసిన విద్యామంత్రిని సోమవారం కలిసి ఎంఈవో లకు సెల్ఫ్ డ్రాయింగ్ అధికారాలను కల్పించాలని కోరామన్నారు. అదేవిధంగా ఎంఈఓ 1%ు%2లకు స్పష్టమైన జాబ్ చార్ట్ ఉత్తర్వులు విడుదల చేయాలని, ఎమ్మార్సీలకు ఇస్తున్న గ్రాంట్ రెండు లక్షల రూపాయలకు పెంపుదల చేయాలని, ఎమ్మార్సీలకు నూతన భవనాలు నిర్మాణం చేయాలని,వాహన సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశామన్నారు. తమ వినతిపై విద్యాశాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎంఈవోల యూనియన్ జిల్లా నాయకులు ఎన్ నాగభూషణరావు, బడే జనార్దన నాయుడు, కె కొండలరావు, ముప్పల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవి నవరాత్రులు

విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలం చెముడు గ్రామంలో దసరా మహోత్సవాలు ఘనంగా అంగరంగ వైభవంగా దేవీ నవరాత్రులు అత్యంత భక్తి శద్ధలతో పూజలు జరుపుకుని దుర్గాదేవి ఆశీస్సులు తీసుకుంటూ గ్రామంలో పంటలు బాగా పండాలి ప్రజల ఆయురారోగ్యాలతో దేవీ నవరాత్రులు అత్యంత వైభవంగా ట్రాక్టర్ డ్రైవర్లు ఆటో యూనియన్ కమిటీ సభ్యులుగా చేరి అత్యంత వైభవంగా ప్రసాదాలు పంచిపెట్టారు దసరా రోజున వివిధ రకాలు వేషధారణలు ధరించి భక్తులను అలరించారు చెముడు గ్రామంలో దుర్గాదేవి నవరాత్రుల పండగ కనువిందుగా కొనసాగింది కమిటీ సభ్యులు చింతల కృష్ణ బొంగుమోహన్ అక్కిన రాము ఏకల శ్రీను చిన్న శంకర్ గొర్ల వెంకట నాయుడు కారణం త్రినాధ శేఖర రావు వెన్నెల పరిశినాయుడు గ్రామ పెద్దలు ప్రజలు భక్తులు ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉచిత గ్యాస్ కనెక్షన్లను వినియోగించుకోవాలి : గుమ్మడి సంధ్యారాణి

విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో ఉచితగ్యాస్ కనక్షణలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సాలూరు టీడీపీ ఇంచార్జ్, పోలిబ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారం మక్కువలోని శ్రీశైంతేశ్వర హెచ్. పి. గ్యాస్ గోడౌన్ ఆవరణలో మండలంలో పలు గ్రామాలకు చెందిన నిరుపేద మహిళలకు మంజూరైన ఉచిత గ్యాస్ సిలెండర్లు, కనక్షణలను ఆమె పంపిణి చేసారు. సుమారు 6వేల రూపాయలు విలువ గల వంట గ్యాస్ కనక్షణలను కేంద్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా పంపిణీ చెయ్యడం మంచి కార్యక్ర మమని అన్నారు. ఇంతవరకు ఎటువంటి గ్యాస్ కనక్షన్ లేని నిరుపేదలుంటే వెంటనే తమ గ్యాస్ ఏజన్స్ కి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని శాంతే శ్వర గ్యాస్ ఏజన్స్ నిర్వాహకులు మవుడి ప్రసాద్ రావునాయుడు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గుళ్ళ వేణుగోపాలనయుడు, టీడీపీ నాయకులు డాక్టరు పి. మల్లేశ్వరావు. సీనియరు నాయకులు చింతల తవిటినాయుడు,అక్యాన తిరుపతిరావు. పెంట సత్యం మాస్టారు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గౌరీ శంకరరావు,కృష్ణ, మధు తదితర్లు పాల్గొన్నారు.

### చంద్రబాబు ఆరోగ్యం బాగుండాలని దుర్గాదేవికి పూజలు

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుగారి ఆరోగ్యం బాగుండాలని కోరుతూ ఆ పార్టీ పొలిటిభ్యూరో సభ్యురాలు శ్రీమతి గుమ్మడి సంధ్యారాణి సోమవారం మక్కువ మండలంలోని పాపయ్యవలస గ్రామంలోని దుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. మండల టీడీపీ నాయకులతో కలసి పాపయ్యవలస గ్రామాన్ని సందర్శించి గ్రామమ లోని వెలసినఉన్న దుర్గదేవికి పూజలు నిర్వహించారు. ఎటువంటి తప్పు లేకుండా వైసీపీ ప్రభుత్వం చంద్రబాబు ని అక్రమంగా జై యిల్లో పెట్టి ఆయన్ని అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని, రాభోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆమె వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## గర్భాపును టీడిపి నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన ఇంఛార్జి విజయ్ చంద్ర

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం నియోజక వర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని వాయిస్ విధానం ద్వారా, పోస్టర్ ద్వారా ప్రకటనచేసిన గర్భాపు ఉదయభానును తెలుగుదేశం పార్టీనుండి సస్పెండ్ చేస్తున్నట్లు టీడీపీ నియోజక వర్గ ఇంచార్జి బొనేల విజయ్ చంద్ర ప్రకటించారు. సోమవారం సాయంత్రం స్థానిక టీడీపీ పార్టీకార్యాలయంలో రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జగదీష్ తో కలిపి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. టీడీపిపార్టీ క్రమశిక్షణకు మారుపేరని, తల్లిలాంటి పార్టీలో క్రమశిక్షణ లేకపోవడం వల్ల పార్టీ అధిష్టానం అదేశాలు సూచనలు మేరకు ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇకనుండి ఎవరు ఇలా ప్రవర్తించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలోనే ఉదయభాను టిడిపి అధినేతపై కూడా విమర్శలు చేసినసమయంలో పార్టీ నాయకత్వం మొదటి తప్పుగా బావించి అతనికి అవకాశం ఇవ్వడం జరిగిందన్న అంశాన్ని వివరించారు. ఇక నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయ భానును గ్రామాల్లో అహ్వానం పలుకవద్దని సూచించారు. విజయదశమి నుండి పార్టీబలోపేతం కోసం ప్రతీఒక్కరూ కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. పార్టీకోసం కష్టపడి పనిచేయడం, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే తనతో పాటు అందరి లక్ష్యమని తెలిపారు. పార్టీలో క్రమ శిక్షణను పాటించకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రవికుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు

## షిర్డీసాయిబాబా ఆలయంలో నివాళులు అర్పించిన సాయిభక్తులు

విశాలాంధ్ర - పార్వతీపురం : స్థానిక వైకేయం నగర్లోని శ్రీషిరిడిసాయి ధ్యానమందిరంలో గల శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో షిర్డీ సాయిబాబాసమాధి చెంది మంగళవారం విజయదశమి నాటికి 105 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సాయిభక్తులచే సమాధికి పుష్పాలువేసి నివాళులు అర్పించే కార్యక్రమంను చేపట్టారు. వైకెఎం కాలనీకి చెందిన భక్తులతోపాటు చినబొండపల్లి, వెంకంపేట, వసుంధరనగర్ తదితరకాలనీల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై బాబావారి విగ్రహాన్ని దర్శించుకున్నారు.కీర్తనలు ఆలపించారు.పూజలు అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విజయలక్ష్మి, సుబ్బలక్ష్మి, నాగు కాకిముక్కల, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## నియోజక వర్గంలో అన్ని గ్రామాల్లో జగనాసుర దహనకాండ కార్యక్రమం

విశాలాంధ్ర - పార్వతీపురం/సీతానగరం/బలిజిపేట : పార్వతీపురం నియోజక వర్గంలోని మూడు మండలాల్లోని అన్ని గ్రామాల్లో,పురపాలక సంఘంలో తెలుగు దేశం పార్టీ పిలుపు మేరకు సోమవారం రాత్రి 7గంటల నుంచి 7గంటల ఐదు నిమిషాల వరకు జగనాసుర దహన కాండ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైకోపాలన అంతం కావడం కన్నా ఈ రాష్ట్రానికి మంచి ఏముంటుందని తెలియజేస్తూ, సైకో పోవాలి అనిరాసిన పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, పార్వతీపురం నేతలు బార్నాల సీతారాం, గొట్టాపు వెంకట నాయుడు, రవికుమార్, దొగ్గ మోహన్, నారాయణరావు, శ్రీరాములు, చంద్రమౌళి, సీతానగరం మండల నాయకులు కొల్లి తిరుపతిరావు, రౌతు వేణు గోపాల నాయుడు, బలిజిపేట నాయకులు పెంకి వేణుగోపాల్ నాయుడు, పెంకి పార్వతమ్మ, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర



# ఎన్ఆర్ఐ ఎమ్మెల్యే ఏం చేసారో తెలపాలి : ఎస్‌కోట మాజీ ఎమ్మెల్యే కోళ్లలలితకుమారి

విశాలాంధ్ర - జామి : ఎస్‌కోట నియోజకవర్గానికి ఎన్ఆర్ఐ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఏం చేసారో తెలియజేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ళ లలితకుమారి డిమాండ్ చేసారు. నియోజకవర్గానికి సంభందంలేని వ్యక్తి కావడంతో అన్ని మండలాలలో సమస్యలు అలాగే ఉండి పోయాయన్నారు. మంగళవారం జామిలో ఆమె విలేఖరుల సమావేశం నిర్వహించారు. జామికి జూనియర్ కళాశాల, కొత్తవలసకు డిగ్రీ కళాశాల హామీలు ఏమయ్యాయన్నారు. నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ అంతా ఒక్కటిగానే పనిచేస్తోందని, వర్గ విభేదాలు లేవన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలనే లక్ష్యంతో అందరూ పనిచేస్తున్నామన్నారు. జామి మండలంలో మాజీ జెడ్‌పిటిసి బండారుపెదబాబు వేరే వర్గంలో ఉన్నారనే వార్తలు నిజం కాదన్నారు. ఆయన మాతో కలిసి పార్టీకి కృషి చేస్తున్నారన్నారు. మండలాన్ని నడిపించే బాధ్యతను పెదబాబు, మాజీ అధ్యక్షుడు గనివాడ ఎర్నాయుడు, వర్రి రమణలపై పెడుతున్నామన్నారు. సమస్యలపై నిత్యం పోరాడుతున్నామని తెలిపారు. మాజీ జెడ్‌పిటిసి బండారుపెదబాబు మాట్లాడుతూ గొంప కృష్ణ వర్గానికి చెందిన మండల పార్టీ అధ్యక్షుడు లగుదు రవికుమార్ నియంతలా వ్యవహరిస్తున్నారని, అందులోనే వర్గాలను ప్రోత్సాహిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ళ లలితకుమారి ఆదేశాల మేరకు మండలంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెబిఎ. రాం ప్రసాద్ మాట్లాడుతూ న్యాయం కోసం పోరాడిన చంద్రబాబును 45 రోజులుగా జైలులో ఉంచారన్నారు. ఇటువంటి పాలనకు చరమ గీతం పాడేందుకు ప్రతీ కార్యకర్త ప్రయత్నించాలని సూచించారు. రానున్న ఎన్నికలకు సమాయత్తం అవ్వాలని, రెండు నియోజకవర్గాల ఇన్‌చార్జిల గెలుపుకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు, ప్రధాన కార్యదర్శి దనియాల పైడిరాజు, పార్లమెంటరీ పార్టీ నేతలు మాకిరెడ్డి శ్రీలక్ష్మి, కొత్తలి సూర్యారావు, ఇతర నేతలు పాల్గొన్నారు.

## శ్రీదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : దసరా పండుగ సందర్భంగా ఎస్.కోట మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదుర్గాదేవి అమ్మవారిని కుటుంబ సభ్యుల సమేతముగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టోన్ క్రషర్ అధినేత అట్లూరి శ్రీవెంకటరావు, డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కేవీఎస్ రామరాజు, సభ్యులు జెర్రిపోతుల ఉమ, జె.మురళి, పెనగంటి గంగరాజు, మళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడలకు డిప్యూటీ చీఫ్ డి మిషన్‌గా వేణుగోపాలరావు

విశాలాంధ్ర - విజయ నగరం టౌన్ : ఈ నెల 26 నుండి నవంబర్ 9 వరకు గోవా లో జరగబోయే 37 వ జాతీయ క్రీడలు కు విజయనగరం జిల్లాకు చెందిన సిహెచ్ వేణుగోపాలరావుని డిప్యూటీ చీఫ్ డి మిషన్‌గా ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ వీరిని నియమించినారు. ఈ పదవిని మొట్ట మొదటి సారిగా మన విజయనగరం జిల్లా నుండి ఎంపిక చేసినందుకు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు గారు మరియు క్రీడా సంఘాలు ప్రతినిధులు అభినందనలు తెలిపినారు .

## దుర్గాదేవి పూజలో పాల్గొన్న టిడిపి ఇంచార్జి విజయ్ చంద్ర

విశాలాంధ్ర - పార్వతీపురం : నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో ఘనంగ జరుగుతున్న దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన దేవీ విగ్రహాలను టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి విజయ్ చంద్ర సందర్శన చేసి పూజలు నిర్వహించారు. అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## రాష్ట్రాన్ని రివర్స్ గేర్‌లో నడిపిస్తున్న వైసీపీ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూర?ంగా ఆలోచించి రాష్ట్రాన్ని రివర్స్ గేర్ లో నడిపిస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు గణపతినీడి శ్రీనివాసరావు ఆరోపించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ గణపతి నీడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రివర్స్ గేర్ లో ఏపీ అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. రివర్స్ గేర్ లో ఏపీ పేరిట నగరంలోని మయూరి జంక్షన్ నుండి బాలాజీ జంక్షన్ మీదుగా కోట జంక్షన్ వరకు రివర్స్ లో పాదయాత్ర అనే కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నర ఏళ్లలో రాష్ట్రం ఏ పరిస్థితుల్లో ఉందో తెలియజేయడానికి రివర్స్ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమన్నారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన విషయాన్ని గమనించి ప్రజలు మేలుకోవాలన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. రోజుల కొద్ది న్యాయం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కానీ చంద్రబాబును ఇంకా విడుదల చేయకపోవడం చాలా బాధాకరమన్నారు. చంద్రబాబు జైలు నుంచి బయటకు రావాలని ప్రజలు మద్దతు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఇతర దేశాల్లోనూ కూడా ఉన్న ఏపీ ప్రజలు చంద్రబాబు కోసం మద్దతు గళాన్ని వినిపిస్తున్నారని స్పష్టం చేశారు. త్వరలోనే చంద్రబాబు జైలు నుంచి బయటకు రావాలని కోరారు. తెలుగుదేశం పార్టీ విజయనగరం పార్లమెంటరీ కార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ చంద్రబాబును అరెస్టు చేసి 45 రోజులు అవుతుందన్నారు. దీంతో ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. గత నాలుగున్నర ఏళ్లలో పోలవరం, పరిశ్రమలు, అభివృద్ధి అన్ని కూడా రివర్స్ లోనే ఉన్నాయన్నారు. సైకో సీఎంకు తగిన బుద్ధి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కనకల మురళీమోహన్, బొద్దుల నరసింగరావు, కర్రోతు నర్సింగరావు టిడిపి న్యాయవిభాగం నాయకులు ఉపాధ్యాయుల రవిశంకర్,తెలుగు యువత నాయకులు సురేంద్ర, చైతన్య, ప్రవీణ్, టిడిపి నాయకులు కుటుంబరావు, కిలాని మహేష్, కే .చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా దుర్గా పూజలు

### పోలీసులు వినియోగించే వివిధ రకాల తుపాకులకు, వాహనాలకు ప్రత్యేక పూజలులి

విశాలాంధ్ర - విజయనగరం : విజయనగరం జిల్లా ఆర్మ్ రిజర్వు విభాగంలో దసరా పర్వ దినంను పురస్కరించుకుని పోలీసులు వినియోగించే వివిధ ఆయుధాలు, పోలీసు వాహనాలకు మంగళవారం జిల్లా ఎస్పీ ఎం. దీపిక ప్రత్యేక పూజలు నిర్వహించారు ముందుగా., వేద పండితులు వేద మంత్రాలు, పూర్ణ కుంభంతో ఆమెకు.స్వాగతం పలికారు. అనంతరం, ఆర్మ్ రిజర్వు ఆయుధగారంలోను, మోటారు ట్రాన్స్పోర్టు ఆర్గనైజేషన్లోను దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పోలీసు విభాగాలకు అన్ని విధాలుగాశుభాలు జరగాలని ప్రార్ధనలు చేసి, వేద పండితులు ఆశీర్వచనం పొందారు. దశరా పండగ సందర్భంగా జిల్లా ఎస్పీఎం. దీపిక పోలీసు అధికారులు, సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపి, ప్రజలందరికీ మంచి జరగాలని, తలపెట్టిన అన్ని కార్యక్రమాల్లో విజయం చేకూరాలని ఆకాంక్షించారు.ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్పీ డి. విశ్వనాథ్, ఆర్ఐ ఎన్. గోపాల నాయుడు, ఎస్బీ సిఐలు కే.కే.వి. విజయనాథ్, ఈ. నర్సింహమూర్తి, 2వ పట్టణ సిఐ ఎన్. హెచ్. విజయ ఆనంద్, రూరల్ సిఐ టి.వి. తిరుపతి రావు, ఆర్.ఎన్.ఐలు నారాయణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, నీలిమ, ప్రసాదరావు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పలు గ్రామాలకు నూతన బస్సు సౌకర్యం

విశాలాంధ్ర - తెర్లాం : మండలం లో ఎన్నో ఏళ్లుగా సుందరాడ, కగాం,అర్.గదబవలస, ఎన్.బూర్జి వలస , నెమలాం , పాములవలస గ్రామాలకు చెందిన ప్రజలు, బయట ఊళ్లలో చదువుకోవడానికి వెళ్ళడానికి ఇబ్బంది పడుతున్న ఇబ్బందులను చూడలేక విజయ నగరం జిల్లా మరియు ఉత్తరాంధ్రలో సంక్షేమ సంఘాల అధ్యక్షులు చనమల్ల ప్రసాదరావు అర్ టి సి మంత్రి పినిసే విశ్వరూప్ , ఈడి .రవికుమార్ మరియు పాలకొండ డిపో మేనేజర్ ల తో మాట్లాడి ఉదయం 7:30 గంటలకు మధ్యాహ్నం 2:00 గంటలకు బస్సు వచ్చే ఏర్పాటు చేసేందుకు మరియు విజయదశమి రోజున బస్సు సర్వీసుకు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. విజయనగరం జిల్లా మరియు ఉత్తరాంధ్ర అధ్యక్షులు చనమళ్ళ ప్రసాదరావు పాటు , పాములవలసా సర్పంచ్ ఈస్వరావు, సుందరాడ, సర్పంచ్ దిలీప్, వెంకన్న , డాకారపు అర్జునరావు, గుండాల అప్పన్న, లక్ష్మీపతి, శంకరావు మహిళలు, పెద్దలు పిన్నలు, విద్యార్థి విద్యార్థినులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## ఆయుధ పూజకు తరలివెళ్ళిన అభిమానులు, టీడిపి నాయకులు

విశాలాంధ్ర - సీతానగరం : విజయ దశమి పండుగ సందర్భంగా ప్రతీ ఏటా బొబ్బిలి రాజులు తమ కోటలో ఆయుధ పూజను ఘనంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జరిగిన పూజలో బొబ్బిలి రాజులు సుజయ్ నాయన, బేబీ నాయనలు పాల్గొనగా వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. సీతానగరం మండలంకు చెందిన శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం, శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ దేవాలయం అర్చకులు శ్రీనివాసాచార్యులు పూజలు చేయించడం గమనార్హం. ఆయుధ పూజలో పార్వతీపురం నియోజక వర్గంలోని సీతానగరం, పార్వతీపురం, బలిజిపేట మండలాల్లోని రాజుల అభిమానులు, టీడీపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వెళ్లి పాల్గొన్నారు. పూజలు నిర్వహించాక సుజయ్ నాయన, బేబీ నాయన్లతో కలసి ఫోటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. రాజులు వాడిన ఆయుధాలు, రాజ కోటను చూసి తరించారు.

## పడాల అరుణను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : జనసేన పార్టీ రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యురాలుగా బాధ్యతలు చేపట్టిన పడాల అరుణను ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు ఒబ్బిన సన్యాసినాయుడు, దేగల ఈశ్వరరావు సోమవారం ఆమె స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభి నందనలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితులపై కాసేపు ముచ్చటించారు. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణ గురించి మాట్లాడి నట్లు సన్యాసినాయుడు తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జనసేన, టీడీపీ విజయమే పరమావధిగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

## పార్వతీపురంలో జగనాసుర దహనం

విశాలాంధ్ర - పార్వతీపురం : తెలుగు దేశం పార్టీ ఆదేశాల మేరకు సోమ వారం పార్వతీ పురం నియోజకవర్గంలో నియోజకవర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర, మాజీ ఎమ్మెల్సీ జగదీష్ ఆధ్వర్యంలో మనం చేద్దాం జగనాసుర దహనంకార్యక్రమంను నిర్వహించి సైకో పోవాలి అనే కరపత్రాలను అగ్నిమంటలో వేసి నిరసన తెలియజేశారు ఈకార్యక్రమంలో పార్వతీపురం పట్టణ,గ్రామీణ అధ్యక్షులు, కౌన్సిలర్లు సీనియర్ నాయకులు ,కార్యకర్తలు అభిమానులు, పాల్గొన్నారు.

## దివ్యాంగురాలకు ట్రై సైకిల్ అందజేత

విశాలాంధ్ర - గుర్ల : మండలంలో పాల లస గ్రామానికి చెందిన ముద్దాడ సింహాచలం అనే దివ్యాంగురాలకు బ్యాటరీ ట్రై సైకలను మంగళవారం ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు చేతుల మీదుగా అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలుగా దివ్యాంగులకు అవకాశాలు కల్పిస్తుందని అన్నారు . నాలుగు గంటలపాటు చార్జింగ్ పెడితే 40 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయొచ్చు అని తెలిపారు.

## గ్రామాల్లో దసరా నవరాత్రులు ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లో దసరా నవరాత్రులు ఆదివారం ప్రారంభం జరిగాయి. దేవీ విగ్రహాలను ఆవిష్కరించి పూజలు నిర్వహించారు.దేవీ నవరాత్రులు సంధర్భంగా భవానీ మాళలు ధరించి పూజలు నిర్వహించారు.సీతానగరం, బుడ్డిపేటలలో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రులు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. జోగమ్మపేట, తామరఖండి తదితర గ్రామాల్లో దేవీ నవరాత్రులు ఘనంగా ప్రారంభం జరిగాయి. దసరా నవరాత్రులలో దేవీమాతను తొమ్మిది రోజులు తొమ్మిది అలంకరణలు చేసి పూజలు నిర్వహించడం జరుగుతుందని అర్చకులు, భవానీలు తెలిపారు. నేటి నుంచి ఈనెల 23వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. మొదటి రోజు ఆదివారం శ్రీబాల త్రిపుర సుందరిదేవి అలంకరణలో, సోమవారం శ్రీగాయత్రీదేవి అలంకరణలో, మంగళవారం శ్రీఅన్నపూర్ణ దేవీ అలంకరణలో, బుదవారం శ్రీమహాలక్ష్మీ దేవీ అలంకరణలో, గురువారం శ్రీమహాచండీ దేవీ అలంకరణలో శుక్రవారం శ్రీసరస్వతీ దేవీ అలంకరణలో, శనివారం శ్రీలలిత త్రిపుర సుందరీదేవి అలంకరణలో వచ్చే ఆదివారం శ్రీదుర్గాదేవి అలంకరలో, వచ్చే సోమవారం శ్రీమహిషా సురమర్ధినీదేవీ అలంకరణలో శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో ఉండి పూజలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. దేవీనవరాత్రుల సందర్భంగా నిర్వహించే పూజలలో భక్తులు పాల్గొని పూజలు చేసి దేవీ అనుగ్రహం పొందాలని అర్చకులు తెలిపారు.

## సిరిమానును దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత కోరిన కోర్కెలు తీర్చే బంగారు తల్లి పైడితల్లి అమ్మవారి ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన సిరిమానును దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంవత్సరం సిరిమానం వృక్షాన్ని జర్జాపు పేటలో వెలసిన విషయం అందరికీ తెలిసిందే. ఈ మధ్యనే అంగరంగ వైభవంగా భారీ ఊరేగింపుతో అక్కడి నుండి పైడితల్లమ్మ ఆలయ పూజారి బంటుపల్లి వెంకట్రావు స్వగృహమైన హుకుంపేట ప్రాంతానికి తరలించారు. నిష్ణాతులైన వడ్రంగి పనివారలు మానును సిరిమానుగా తీర్చిదిద్దే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. హుకుంపేటకు చేరుకున్న సిరిమానును దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గురాటలతో అభిషేకిస్తున్నారు. ఈ క్రమంలో దశరా పర్వదినాన్ని పురస్కరించుకొని సిరిమానును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి దర్శించి పూజలు చేశారు. అక్కడ జరుగుతున్న పనులపై స్థానికులు ఆయనకు వివరించారు. ప్రధాన రథాలు చేస్తామని, హుకుంపేట నుండి ఊరేగింపుగా జాతర సమయానికి చేరుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో పూజారి బంటుపల్లి వెంకట్రావు,స్థానిక కార్పొరేటర్ మీసాల రమాదేవి, కోఆప్షన్ సభ్యురాలు పద్మ పద్మావతి, వైసీపీ నాయకులు మీసాల మధుసూదన్ రావు, లంక నరేష్ ,పిల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీతం కళాశాల బాలికల హాస్టల్‌లో ఘనంగా దుర్గా నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ లో సాంస్కృతిక కార్యక్రమాలు, మంత్ర ముగ్దులను చేసే దాండియా నృత్యాలు ను వేడుకగా నిర్వహించారు. సీతం హాస్టల్‌లో ఉన్న 250 మంది ఉత్సాహవంతులైన బాలికలు ఈ సంతోషకరమైన కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. సరస్వతీ దేవి పూజలో విద్యార్థినిలు పాల్గొని ఆశీర్వాదం పొందారు. సంప్రదాయ దాండియా, గర్బా సంగీతానికి యువతులు తరలివచ్చి అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే దృశ్యకావ్యాన్ని సృష్టించడంతో వాతావరణం సుమనోహరంగా మారింది. హాజరైన వారందరూ పవిత్ర ప్రసాదం మరియు ఆనందకరమైన విందును ఆస్వాదించారు. విద్యార్థినిలు సీతం హాస్టల్‌ను వారి రెండవ ఇల్లుగా భావిస్తారు, ఇక్కడ సంస్కృతి,సంప్రదాయాలు మరియు ఆధ్యాత్మికత వారి విద్యా ప్రయాణంతో సజావుగా కలిసిపోతాయి .సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ దాండియా నైట్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక చైతన్యం, ఐక్యత, ఆత్మీయతా భావాన్ని పెంపొందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు విద్యాపరంగా రాణించడమే కాకుండా సమాజం, సంస్కృతి పట్ల దృఢమైన అనుభూతిని కలిగించే వాతావరణాన్ని అందించడానికి మేము కట్టుబడి ఉన్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, మజ్జి అనురాధ, బొత్స పూజిత, వార్డెన్ ఎం. సత్యవేణి, సిబ్బంది, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా దుర్గా పూజలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లా ఆర్మ్ రిజర్వు విభాగంలో దసరా పర్వ దినంను పురస్కరించుకుని పోలీసులు వినియోగించే వివిధ ఆయుధాలు మరియు పోలీసు వాహనాలకు అక్టోబరు 24న జిల్లా ఎస్పీ ఎం. దీపిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎం.దీపిక ముఖ్య అతిధిగా హాజరుకాగా, వేద పండితులు వేదమంత్రాలు, పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం, ఆర్మ్ రిజర్వు ఆయుధగారంలోను, మోటారు. ట్రాన్స్పోర్టు ఆర్గనైజేషన్లోను దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పోలీసు విభాగాలకు అన్ని విధాలుగా శుభాలు జరగాలని ప్రార్ధనలు చేసి, వేద పండితులు ఆశీర్వచనం పొందారు. దశరా పండగ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం. దీపిక పోలీసు అధికారులు, సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపి, ప్రజలందరికీ మంచి జరగాలని, తలపెట్టిన అన్ని కార్యక్రమాల్లో విజయం చేకూరాలని ఆకాంక్షించారు.ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్పీ డి.విశ్వనాథ్, ఆర్ఐ ఎన్. గోపాల నాయుడు, ఎస్బీ సిఐలు కే.కే.వి. విజయనాథ్, ఈ. నర్సింహమూర్తి, 2వ పట్టణ సిఐ ఎన్. హెచ్. విజయ ఆనంద్, రూరల్ సిఐ టి.వి. తిరుపతిరావు, ఆర్.ఎన్.ఐలు నారాయణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, నీలిమ, ప్రసాదరావు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర, శృంగవరపుకోట : ఎస్.కోట మెయిన్ రోడ్డులో గర్ల్స్ హైస్కూలు ఎదురుగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బాధితులు కందాల సన్యాసిరావు కుటుంబ సభ్యులను పరా మర్శించారు. బాధితులు కట్టుబట్టలతో మిగిలామని, ప్రమాదంలో బంగారు ఆభరణాలు, రూ.2లక్షల నగదు, వస్తు సామాగ్రి కాలిపోవడంతో సుమారు రూ.7లక్షల నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకి చెబుతూ భోరున విలపించారు. ఎమ్మెల్యే కడుబండి ఘటనా స్థలం నుండి తహశీల్దార్ డి.శ్రీనివాసరావుతో ఫోన్లో మాట్లాడుతూ తక్షణం ప్రమాదస్థలాన్ని పరిశీలించి నష్టం వివరాలను అందించాలని ఆదేశించారు. అలాగే బాధిత కుటుంబానికి రూ.10వేల నగదును ఎమ్మెల్యే అందజేశారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందజేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కడుబండి వెంట రాష్ట్ర ఫోక్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, రేషన్ డీలర్ల రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు, పోతనాపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, సీనియర్ నాయకులు కడారి అప్పయ్య, మజ్జి శేఖర్, పెనగంటి జగదీష్, కడారి జయశంకర్, గణేష్ తదితరులు ఉన్నారు.

## పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా పింఛనుదారులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగులకు, ఎపిఈవి డిసిఎల్ ఉద్యోగులకు, ఎపిఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు హెల్త్ ఇన్స్యూరెన్స్ (టిపిఎ) కలిగియున్న వారికి, వారి డిపెండెంట్స్ కి విజయనగరం శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వారిచే కంటి పరీక్షలు నిర్వహించబడునని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి దొడ్లంకి గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైనవారికి నగదు రహిత ఆపరేషను సేవలు తే 25-10-2023 దీన రైతు బజారు వెనుక గల విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం నందు జరుపబడునని తెలిపారు. కావున పై తెలిపిన వారు వచ్చునపుడు మీయొక్క హెల్త్ కార్డు, హెల్త్ ఇన్స్యూరెన్స్ కార్డు, వైఎస్ఆర్ హెల్త్ కార్డు, ఆధార్ కార్డ్, బ్యాంకు పాస్ పుస్తకం తప్పకుండా తీసుకురావలసినదిగా కోరారు. ఉదయం 10-00 గం. నుండి మధ్యాహ్నం 1-00 గం. వరకు పరీక్షిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవలసినదిగా కోరారు.

## దసరా పండుగ వేళ ఎస్.కోటలో భారీ అగ్నిప్రమాదం

### రూ.7లక్షల ఆస్తి నష్టం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట పట్టణంలోని గర్ల్స్ హైస్కూలు ఎదురుగా నివాసం ఉంటున్న కందాల సన్యాసిరావు ఇంట్లో మంగళవారం ఉదయం కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి షేక్ మదీనా ఆధ్వర్యంలో సిబ్బంది ప్రాణాలకు తెగించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో వస్తు సామాగ్రితో పాటు బట్టలు, బంగారు ఆభరణాలు, నగదు అన్నీ కాలిబూడిద కావటంతో సుమారు 7 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. అయితే అదృష్టవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఫైర్ సిబ్బంది వెల్లడించారు.

# పార్వతీపురం మన్యం జిల్లాలో సిట్టింగు ఎమ్మెల్యేలకే మరలా టిక్కెట్లు కేటాయింపు?

## రాజుల ప్రభావంపైనే టీడీపీఆశలు
## ఓటర్లనాడి తెలియక తలలు
## పట్టుకుంటున్న సర్వేల ప్రతినిధులు

విశాలాంధ్ర - పార్వతీపురం : రానున్న ఏప్రిల్ నెల మొదటివారంలో జరుగనున్న శాసనసభ ఎన్నికలలో పార్వతీపురం మన్యంజిల్లాలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాలలో అధికారపార్టీ వైఎస్ఆర్సీపీ తరుపున సిటింగ్ ఎమ్మెల్యేలకే టిక్కెట్లు కేటాయింపు జరిగే అవకాశం ఉందని దాదాపు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే నిర్వహించిన పలుసర్వేలుసైతం వీరికే అనుకూలంగా ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తవారికి కేటాయించి తల నొప్పులు తెచ్చుకొనేకంటే పాతవారికి కేటాయించడం నబబని ఆలోచనచేస్తున్నట్లు విశ్వశనీయ సమాచారం.దీంతోపాటు ఇటీవల పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి, క్రియాశీలకనేతల ఆశీస్సులు తమకే ఉన్నట్లు వారంతా బహిరంగంగా చెప్పుకుంటున్నారు. పార్వతీపురం నియోజక వర్గంలో ఎమ్మెల్యే జోగారావుకు టిక్కెట్ ఖరారు జరిగినట్లు తెలుసుకొని మూడు మండలాల్లోని, పురపాలక సంఘంలో నేతలు, నాయకులు, ప్రజా ప్రతినిదులు అయనకు ముందస్తు అభినందనలు తెలియజేయడం, ఊరిగింపు చేయడం కూడా జరిగింది.సోమవారం పార్వతీపురంలో జరిగిన ఆరువేలమంది పార్టీ కార్యకర్తల సమావేశంలో రాష్ట్రమంత్రి, రీజనల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ మాటల్లో జోగారావును రానున్న ఎన్నికలలో మళ్ళీ గెలిపించి ఆశీర్వాదం అందజేయండని తెలిపారు . ఇదిలా ఉండగా ఎన్నికలవ్యవది ఇంకా ఐదునెలల మాత్రమే ఉండటంతో ఈసమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరోక్షంగా సిటింగ్ ఎమ్మెల్యేలకు సూచనలను ఇప్పటికే జారీ చేస్తున్నట్లు కనిపిస్తోంది.నవంబరు నెలలో జిల్లాలో జరిగే బస్ యాత్రలకు అన్ని ఏర్పాట్లు చేయడంలో నాయకత్వం నిమగ్నం కావడం గమనార్హం.సిటింగులకే ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయిస్తే పార్వతీపురం నుండి అలజింగి. జోగారావు, సాలూరునుండి పి. రాజన్నదొర, కురుపాంనుండి పాముల పుష్పాశ్రీవాణి, పాలకొండనుండి విశ్వసరాయి కళావతిలు మరలా పోటీ చేయనున్నారు. రాజన్నదొర ఇప్పటికే వరుసుగా మూడుసార్లు ఎమ్మెల్యే అవ్వగా, నాలుగోసారి ఆయన పోటీచేయ నున్నారు.పాముల పుష్పాశ్రీవాణి, విశ్వసరాయి కలావతిలు రెండుసార్లు గెలవగా మూడోసారి పోటీచేయడానికి సిద్ధపడుతున్నారు. అలజింగి జోగారావు గతఎన్నికలలో మొదటిసారి ఎమ్మెల్యే కాగా,రెండోసారి పోటీకి సిద్ధ పడుతున్నారనితెలుస్తోంది. జిల్లాలోని కురుపాం, సాలూరు,పాలకొండ నియోజక వర్గాలు ఎస్టీ నియోజక వర్గాలుకాగా,పార్వతీపురం ఎస్సీ నియోజకవర్గంగా ఉన్నసంగతి తెలిసిందే. గతంలో ఈనాలుగు స్థానాలను అధికార పార్టీ వైఎస్సార్సీపీ దక్కించుకున్నందున రానున్న 2024ఎన్నికలలో ఖచ్చితంగా గెలుస్తామని ధీమాను వైఎస్సార్సీపీ పార్టీనాయకులు, ప్రజా ప్రతినిదులు అంటున్నారు.

**రాజుల ప్రభావంపై టీడీపీ ఆశలు:**

రానున్న ఎన్నికల్లో అధికారపార్టీ అభ్యర్థులకు ప్రత్యర్థిపార్టీ ధీటైనపోటీ ఇవ్వడం ఖాయమని ప్రతిపక్షనాయకులు అంటున్నారు. బొబ్బిలి,కురుపాం, చినమేరంగి రాజులప్రభావం ఈనాలుగు నియోజకవర్గాల్లో ఉంటుందని రాజకీయ విశ్లేషకులు, రాజకీయపార్టీలు అభిప్రాయపడుతున్నారు. కురుపాం రాజులు కిషోర్ చంద్రదేవ్ - ప్రదీప్ దేవ్, చినమేరంగిరాజు విజయరామరాజు, బొబ్బిలి రాజులు సుజయ్ నాయన - బేబీనాయనలు టీడీపీలో ఉండటంతో వారు రానున్న ఎన్నికలలో క్రియాశీలకపాత్ర పోషిస్తారనే ప్రచారం పెరుగుతుంది.టీడిపి, జనసేన, బీజేపీ, వామపక్షాలు కలసి పోటీచేసే పరిస్తితి ఉందని,అధికార పార్టీను ఢీకొట్టడంపై పెద్దఎత్తున ప్రచారాన్ని నిర్వహిస్తారని ప్రతిపక్ష పార్టీల నాయకులు చెబుతున్నారు. త్వరలో ప్రతిపక్షపార్టీలకు చెందిన అభ్యర్థుల ప్రకటన కూడా వెలువడిన తర్వాత మరింత వేడెక్కే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే టీడీపి ఇంచార్జిలుగా ఉంటున్న వారికే అభ్యర్థులుగా అవకాశం ఉండటంతో వారు కార్యక్రమాలని విజయవంతంగా నిర్వహి స్తున్నారు. గత 45 రోజులుగా టీడీపి జాతీయ అధ్య క్షుడు నారాచంద్రబాబు నాయుడు అరెస్టు అరెస్టు సందర్భంగా టీడీపీ నాయకులు వాడవాడలా పెద్ద ఎత్తున సంఘీభావ కార్యక్రమాలను ముమ్మరంగా చేస్తున్నారు. నేటినుంచి భువనేశ్వరీ ఆద్వర్యంలో, నిర్వహించే కార్యక్రమాలు, టీడిపి - జనసేన సమన్వయంతో త్వరలో నిర్వహించే కార్యక్రమాలు వల్ల ఎన్నికలవేడి వారిలో ప్రారంభమయి ఒదని చెప్పవచ్చు. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటర్లు రానున్న 2024ఎన్నికలలో ఏపార్టీకు ఓటువేస్తారో ఎవరికీ అంతుపట్టడం లేదు. గతంలో జరిగిన ఎన్నికలన్నీ ఒకఎత్తయితే, 2024లో జరగనున్న సాదారణఎన్నికలు ఒకఎత్తని మేధావులు, విశ్లేషకులు, రాజకీయ పార్టీల నాయకులు అంటున్నారు. ఓటర్ల నాడి పట్టుకోవడం చాలా చాలా కష్టంగా ఉందని సర్వేలను చేస్తున్నవారు సైతం చెప్పడం గమనార్హం.కేంద్ర, రాష్ట్రాల్లో జరిగే ఎంపీ,ఎమ్మెల్యే ఎన్నికలుకోసం నాయకులు ఎదురు చూస్తుండగా, ఓటు అనే ఆయుధంతో తీర్పు ఇవ్వడానికి ఓటర్లు ఎదురు చూస్తున్నారు. ఈఎన్నికల్లో తీర్పు ఎవరికీ అనుకూలంగా, ఎవరికీ ప్రతికూలంగా ఉంటుందో మరోఆరునెలలు వేచిచూడాలి మరి.